క్లుప్తంగా

పోచమ్మ బోనాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సింహులు, ఉపాధ్యక్షుడు గడ్డం మహేష్ ఆధ్వర్యంలో మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో అమ్మవారికి బోనాలు, చీరెలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి వెంకటస్వామి, మోడెం రమేష్, గడ్డం రాజమౌళి, గడ్డం కొండల్ పాల్గొన్నారు.

వెంటాడుతున్న అకాల వర్షాలు

మంగపేట: అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన చిరుజల్లుతో ప్రారంభమై రాత్రి 7.30 వరకు ఒక మోస్తారుగా కురిసింది. దీంతో మండల వ్యాప్తంగా కరెంటు సరఫరా పూర్తి నిలిచి పోయింది. పంట చేతికి అందివచ్చే సమయంలో వర్షం పడటంతో రైతులు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లో ఆరెట్టి ఉంచిన మిర్చి, ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు నానా తాంటాలు పడ్డారు.

పరామర్శ



వెంకటాపురం(ఎం): మండలంలోని కేశవపూర్ గ్రామానికి చెందిన గుడిగందుల కిష్టయ్య ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్ రామ్ నాయక్, స్థానిక ఎంపీటీసీ తోగరు అశోక్, యువజన విభాగం నియోజకవర్గ ఇన్చార్జ్ కోగిల మహేష్, ప్రధాన కార్యదర్శి గోవిందు రాజ్ కుమార్, మండల అధ్యక్షుడు బైకాని సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మంగపేట: మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన అడప రవి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మున్నూరు కాపు సంఘం నాయకులు పరామర్శించి సంఘం తరుపున 50 కేజీల బియ్యం, రూ.45,00 నగదును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆకుల ప్రభాకర్, చింతనిప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి



ములుగు రూరల్(గోవిందరావుపేట): పిడుగు పడి దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన గోవిందరావుపేట మండలం దుంపిల్లగూడెంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుంపిల్లగూడెం గ్రామానికి చెందిన బోళ్ల అశోక్ తన వ్యవసాయ పొలం వద్ద ఎద్దుల బండి కట్టుకుని వెళ్లాడు. పనులు ముగించుకొని ఎద్దుల బండిపై గడ్డి తీసుకొని ఇంటికి బయలుదేరాడు. గ్రామ సమీపంలోకి రాగానే భారీ వర్షం మొదలయింది. ఎద్దుపై పిడుగుపడడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.70 వేల ఉంటుందని తెలిపారు. రైతు అశోక్‌కు గాయాలు కాగా వైద్యం కోసం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ములుగు రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్: మునుగోడు ఉప ఎన్నికల్లో రేవంత్ రెడ్డి రూ.25 కోట్లు బీఆర్ఎస్ నుంచి తీసుకున్నారని ఈటల రాజేందర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని కాశిందేవిపేటలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్‌పై బురదజల్లె ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రేవత్‌రెడ్డిపై అసత్యపు ప్రచారం చేసిన ఈటలకు ప్రజలు బుద్ధి చెపుతారని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, కోటి, రేవంత్‌యాదవ్, భిక్షపతి, శ్రీను, అజ్జు , తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ మాటలు అవివేకం

ఏటూరునాగారం: మునుగోడు ఉప ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ రూ.25కోట్లు ఇచ్చారని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అనడం అవివేకంగా ఉందని పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజేందర్ అసత్యపు ఆరోపణలు చేశారని, ఆ మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోనేది లేదన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు ఆయూబ్, నర్సింహారావు, చెన్నూరి బాలరాజు, చిన్న ఎల్లయ్య, రియాజ్, ముక్కెర లాలయ్య, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, సర్వ అక్షత్, మధుబాబు, కరణె సత్యం పాల్గొన్నారు.



ఏటూరునాగారం: మాట్లాడుతున్న రఘు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మంగపేట: రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తిమ్మంపేట క్రాస్‌రోడ్డు వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మండల అధ్యక్షుడు మోదుగు బాబు, తోలెం నర్సింహారావు, శానం నరేందర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెల్లాలన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు నాయకులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు.సమావేశంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ నర్ర శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శిగుండేటి రాజు యాదవ్, మండల నాయకులు చిట్టిమళ్ల సమ్మయ్య, పోలిన హరిబాబు, సుకుమార్, శంకర్, అర్జున్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



ప్రత్యేక పూజలు చేస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: గ్రామదేవతల అనుగ్రహంతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని ఒడితల గ్రామంలో నిర్వహించిన శ్రీ భూలక్ష్మి, మహాలక్ష్మి వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ దేవతల అనుగ్రహంతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరారు. అనంతరం భూలక్ష్మి నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గండ్రను శాలువాతో సన్మానించారు. జెడ్పీటీసీ గొర్రె సాగర్, వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, సర్పంచ్ ఎర్రబెల్లి సాంబలక్ష్మి, నాయకులు మెదరి కృష్ణ, మేదరి రంచెందర్, బండారి వైకుంఠం, రాజయ్య, శివ, కత్తి సతీష్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో సత్యనారాయణరావు

ఒడితల గ్రామంలో గ్రామదేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సంతోషంగా, ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బాసని రమేష్, యూత్ అధ్యక్షుడు మ్యాదరి జగపతి, బండి భగవాన్, పట్టెం శంకర్, కాంపెల్లి శ్రీకాంత్, గట్టు రాజు ఉన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

టేకుమట్ల: గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సీఐ వేణుచందర్ అన్నారు. ఆదివారం మండలంలోని భూర్నపల్లిలో మేము సైతంలో భాగంగా ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లోని కూడలీల్లో, రద్దీ ప్రాంతంలో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోని వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడే వ్యక్తులను సులభంగా గుర్తించవచ్చని అన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి దొంగతనాలకు తావులేకుండా ఉండవచ్చని అన్నారు. దుకాణాల్లో ఎప్పుడైనా చోరీ జరిగితే సులభంగా గుర్తించవచ్చని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండలంలోని మారుమూల గ్రామమైన భూర్నపల్లిలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండ సర్వేశం పాల్గొన్నారు.



టేకుమట్ల: సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల, కుంట్లం, అన్నారం, మద్దులపల్లి, పూస్కుపల్లి, ఇప్పలబోరు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు దాతల సాయంతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆయా గ్రామాల్లో 50కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ గ్రామాల్లోని సీసీ కెమెరాలు కాళేశ్వరంలోని కమాండ్ కంట్రోల్ రూంలో వీక్షించచ్చు. త్వరలో జిల్లా ఎస్పీ జే. సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేయడానికి కాళేశ్వరం పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆదివారం పలుగుల గ్రామంలో దాతలు ఇచ్చిన రూ.50వేలను సీసీ కెమెర టెక్నీషియన్ ప్రవీణ్‌కు ఎస్సై లక్ష్మణ్‌రావు అందజేశారు.

గొత్తికోయలకు అండగా పోలీసులు

మహాముత్తారం: బతుకుదెరువు కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వచ్చిన గొత్తికోయలకు స్థానిక పోలీసులు అండగా నిలుస్తున్నారు. ఉపాధికోసం పొట్టచేత పట్టుకొని అడవుల్లో నివసిస్తున్న వీరికి పోలీసులు సహాయ సహకారాలు అందించడంపై వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన చాలా మంది మండలం సింగారం అటవీప్రాంతానికి వల్స వచ్చారు. వలసచ్చిన గొత్తికోయలకు ఎలాంటి వసతులు లేకపోవడంతో పోలీసులు వారిని అన్ని రకాలుగా ఆదుకుంటున్నారు. వారికి మంచినీరు సౌకర్యంతోపాటు చలికాలం వచ్చిందంటే దుప్పట్ల పంపిణీతోపాటు సోలార్ లైట్లు, వ్యవసాయ పనిముట్లు, సైకిల్లు, గర్భిణులకు వైద్యపరీక్షలు, యువకులకు క్రీడాసామగ్రి, చిన్నారులకు ఆటవస్తువులు పంపిణీ చేసున్నారు. అంతేకాకుండా దాదాపు నెలకో సారి గొత్తికోయలగూడాలను సందర్శించి వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెల్సుకొని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి వారి ఆలోచనలకు అనుగునంగా పోలీసులు వీరికి అన్నిరకాలుగా ఆదుకొంటుంన్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులకంటే తెలంగాణ పోలీసులు శభాష్ అంటు కితాబు పలుకుతున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్..

మావోయిస్టుల ప్రభావాలను నిర్మూలించేందుకు కాటారం సబ్‌డివిజన్ పోలీసులు తూర్పు డివిజన్‌లోని అటవీ గ్రామాలైన మల్హర్, పలిమెల, మహదేవపూర్, మహాముత్తారం మండలాల్లో చేపట్టిన ఆపరేషన్ కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయి. ఫ్రెండ్లీ పోలీసుల పేరట గ్రామీన ప్రాంతాల్లోని ప్రజలకు తామున్నామని భరోసా కల్పిస్తున్నారు. అందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన గొత్తికోయలతో పాటు ఆయా మండలాల్లోని గిరిజనులకు సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు చేస్తు వారికి అండగా నిలుస్తున్నారు.



గొత్తికోయలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్పీ

నియామకం



నియమక పత్రం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా ఏటూరునాగారం గ్రామానికి చెందిన చిప్ప అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడ పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రమాణ స్వీకారం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ రావు అధ్యక్షతన జరగగా ఎమ్మెల్సీ రమణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కు నియామకం పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు, పద్మశాలి కుల బంధువులకుదరికి ధన్యవాదాలు అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందకట్ల స్వామి, కందకట్ల శ్రీనివాస్, చుంచు రమేష్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన మేడిపల్లి మల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం మలమహానాడు నాయకులు పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెల్సుకోని బియ్యంతో పాటు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పక్కల రాజబాపు, మధూకర్, రవి, స్వామి, వెంకటయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా..

మహదేవపూర్: కల్వర్టును ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. సూరారం నుంచి రాపల్లి కోటకు పొలంలో మట్టి పోసేందుకు వెళ్తున్న ట్రాక్టర్ రాపల్లికోట సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మధుకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో ఎస్సై లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. యువత బాగా చదువుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసకావొద్దని, మావోయిస్టులకు సహకరించద్దని పేర్కొన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

గొంతెమ్మ గుట్టపై పట్నాలు



గుట్టపై పట్నాలు వేస్తున్న భక్తులు

కాటారం: పురాతన ఆలయంగా ప్రాచుర్యం పొందిన మండలంలోని ప్రతాపగిరి గుట్టపై ఆదివారం మహారాష్ట్రకు చెందిన పలువురు భక్తులు స్వామి వారికి పట్నాలు వేశారు. మహారాష్ట్రలోని పెంటిపాక, తూనూరు గ్రామాలకు చెందిన ఆదివాసీ, గిరిజన భక్తులు పట్నాలు వేసి మొక్కులు సమర్పించారు. గుట్టపైనే వంటలు చేసుకొని భుజించారు. ప్రతి ఏడాది వచ్చి మొక్కులు సమర్పించుకుంటామని వారు తెలిపారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ధనలక్ష్మీ

ములుగు రూరల్: మహిళలు రాజకీయాలల్లో రాణించాలని సామాజిక న్యాయ వేదిక మండల మహిళా కార్యదర్శి ధనలక్ష్మీ అన్నారు. ఆదివారం మండలంలోని రామయ్యపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభ దమాషా ప్రకారం మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించడం లేదని అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేసి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటునందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బొంకూరి పారిజాతం, మల్లక్క, పూలక్క, రజిత, సమ్మక్క, లక్ష్మీ, మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

కమిటీలు వేసి ఉద్యమిస్తాం..



సన్మానం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: రాష్ట్రంలో గ్రామ గ్రామాన మాల మహానాడు కమిటీలు వేసి ఉద్యమిస్తామని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్‌హాల్‌లో మాల మహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ అధ్యక్షతన దళిత రత్న అవార్డుల గ్రహీతల సన్మానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ పసుల రాంమూర్తి హాజరై మాట్లాడారు. అనంతరం దళిత రత్న అవార్డు గ్రహీతలైన తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బందేల యాదలక్ష్మి, ములుగు జిల్లా తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు రాజమల్ల సుకుమార్‌లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాదరి రామయ్య, వేల్పుల సమ్మక్క, రాష్ట్ర కార్యదర్శి గోస్కుల రాంబాబు, మాదరి నరసింహారావు, గంపల నర్సయ్య, మాదరి రాంబాబు, గద్దల సత్యం, మాదరి భాస్కర్, కుక్కల చంద్రశేఖర్, మాదరి సురేష్, పెంచికల లక్ష్మీనారాయణ, పెయ్యాల రాకేష్, నారా ప్రశాంత్, చుక్కల వినోద్, మాదరి చిరంజీవి, గంపల శంకర్, కాళ్ల సారయ్య పాల్గొన్నారు.

ఐటీడీఏ ఉద్యోగి కుమారుడికి టీఆర్ఎఫ్ నిధులు

ఏటూరునాగారం: గిరిజనులకు అత్యవసరంగా ఆపదలో ఆదుకునేందుకు గిరిజన సంక్షేమశాఖ ఐటీడీఏ ద్వారా ట్రైబల్ రిలీఫ్ ఫండ్‌ను పీఓ ఆదేశాల మేరకు అందజేస్తుంది. దాన్ని అదునుగా తీసుకున్న ఐటీడీఏ ఉద్యోగి తన కుమారుడికే టీఆర్ఎఫ్ కింద రూ.25వేలు తీసుకోవడం గమనార్హం. ఐటీడీఏలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన కుమారుడిపై టీఆర్ఎఫ్ పథకం కింద రూ.25వేలు పొందారని పలు ఆదివాసీ సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి చర్యలు లేవు. టీఆర్ఎఫ్ ఫండ్ పేద గిరిజన ప్రజలు, ఆర్థిక ఇబ్బందులు, వైద్య ఖర్చులు, చదువులు ఇలా దారిద్రపు రేఖకు దిగువన ఉన్న గిరిజన కుటుంబానికి, వ్యక్తికి ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఇచ్చే వేలాది రూపాయల వేతనం పొందుతూ గిరిజనుల సేవ చేయాల్సిన ఉద్యోగి తన చేతిలోనే దస్త్రాలున్నాయనే అక్కసుతో నిధుల మంజూరు జాబితాలో పేరు పెట్టుకొని ఆ పథకాన్ని పొందారు. ఇలా నిరుపేదలకు అందాల్సిన ఫలాలను ఉద్యోగులే పొందుతుండడంతో ఇక సామాన్య గిరిజనుడికి ఏం న్యాయం జరుగుతుందని ఆదివాసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

సభను విజయవంతం చేయండి



పార్టీ జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ ఆధ్వర్యంలో నేడు(సోమవారం) నిర్వహించనున్న ప్రతినిధుల సభకు కార్యకర్తలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నర్సాపూర్, తాడ్వాయి, కాటాపూర్, దామెరవాయి, గంగారం గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రచారం చేశారు. గ్రామ కమిటీలకు పార్టీ జెండాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ సారి ఎన్నికల్లో ములుగులో గులాబీ జెండా ఎగరవేడయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రావు, బండారి చంద్రయ్య, మండల ఉపాధ్యక్షుడు చల్లా రజినికర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, నాయకులు పిన్నింటి యాదిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సలేందర్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

వాహన పత్రాలు లేకుంటే చర్యలు

వెంకటపురం(కె): రోడ్డుపై వాహనాలకు సరైన పత్రాలు లేకుంటే చర్యలు తప్పవని వెంకటపురం సీఐ శివప్రసాద్ అన్నారు. మండలంలోని నూగూర్ వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం సీఐ వాహనాలను తనిఖీ చేశారు. పేరూర్, భద్రచలం నుంచి వచ్చి పోయే వాహనాలను ఆపి తనిఖీ నిర్వహించారు. అనుమానం వచ్చిన వారిని అదుపులోకి తీసుకోని విచారించారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ

ప్రయాణం.. ప్రమాదం



పరిమితికి మించి ప్రయాణిస్తున్న కూలీలు

వెంకటాపురం(కె): మండలంలో మిర్చి కోతలకు, నూతన భవనాల నిర్మాణాలకు కూలీలు బోలేరో వాహనాల్లో, ఆటోల్లో ప్రయాణాలు చేస్తున్నారు. పరిమితికి మించి ఎక్కి ప్రయాణిస్తున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు వాపోతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడేటప్పుడు పోలీసులు హడవిడి చేసి కేసులు నమోదు చేస్తున్నారే తప్ప మిగిలిన సమయాల్లో ఆటోల్లో, ట్రాక్టర్లో, ఇతర వాహనాల్లో పరిమితికి మించి జనాలతో వెళ్తున్న పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని గామస్తులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274